# లోటు




"అనాథ శరణాలయం వాళ్ళు పెంచుకుంటామంటే బిడ్డనిస్తామన్నారు" అన్నాడు ప్రణీత్.

మాట్లాడలేదు ప్రసన్న.

అర్ధాంగి నోటి నుండి ఏ మాట రాకపోవడంతో మళ్ళీ తనే అన్నాడు. "చెప్పు ప్రసన్నా. బాబునా?... పాపనా?... ఎవర్ని తీసుకురమ్మంటావ్?"

"వద్దు. మీరెవర్నీ తేవద్దు. పెంచుకున్నంతమాత్రాన పరాయి బిడ్డ మనబిడ్డ ఎలా అయిపోతుంది?... అసలు మిమ్మల్ని ఎవరు వెళ్ళమన్నారక్కడికి?" మండిపడ్డది ప్రసన్న.

గాఢంగా నిట్టూర్చాడు ప్రణీత్.

పేరుకు తగ్గట్టు నిత్యం ప్రసన్నంగా కనిపించే భార్య ఈ మధ్య బాగా డిప్రెషన్‌కి లోనైంది. ఎప్పుడు చూసినా పరాగ్గా ఉంటోంది. పలకరిస్తే చిరాకు పడుతోంది. ఆమెతో ఇప్పుడు మాట్లాడాలంటేనే బెరుగ్గా ఉందంతడికి. మరి ఆమెను కదిలించడం ఇష్టం లేక అక్కడనుండి వెళ్ళిపోయాడు.

ప్రణీత్, ప్రసన్న ఐ.టి.రంగంలో ఉద్యోగస్తులు. ఒకే బ్రాంచిలో పనిచేస్తున్నారు. ఒకరినొకరు ఇష్టపడి పెళ్లిచేసుకున్నారు. అవసరాలకు మించిన ఆర్జన. రోజులు జాలీగా గడచిపోతున్నాయి. వంట మనిషిని పెట్టుకోవడంవల్ల ప్రసన్నకి స్టౌమీద కుక్కరెక్కించే పని కూడా లేదు. ఆఫీసు నుండి వచ్చీ రాగానే కార్లో షీకార్లు చేయడం, విందులు వినోదాల్లో పాల్గోడం వారి నిత్యకృత్యాలయ్యాయి. పండగలకు, పబ్బాలకి భార్యని తీసుకుని ఇటు తల్లిదండ్రుల దగ్గరికి, అటు అత్తవారింటికి వెళ్ళొస్తుంటాడు ప్రణీత్. "కన్నవాళ్లు కలిగిన వాళ్ళవడంవల్ల వాళ్ళకి డబ్బు పంపవలసిన పనిలేదు. కారుతో పాటు వాళ్ళకి ఇంట్లో ఫ్రిజ్, బిగ్ టివి, కంప్యూటరు, ఇంటర్నెట్, ఎసిలాంటి హంగులన్నీ ఉన్నాయి. తనకు కావలసిన నగ నట్రా చేయించుకుంది ప్రసన్న. ఇరువురూ విలువైన దుస్తులు ధరిస్తూ సమాజంలో ఉన్నత శ్రేణికి చెందిన వారిలా మెలుగుతున్నారు. రోజులు వాళ్ళకి క్షణాల్లా గడచిపోతున్నాయి. పెళ్ళైన మూడేళ్ళకు గాని తనలోటేమిటో తెలియరాలేదు ప్రసన్నకి. అప్పటినుండి ఆమెకు పిల్లలు లేరన్న దిగులు పట్టుకుంది.

"అప్పుడే వయసు అయిపోయినట్లు బాధపడతావెందుకు? దేనికైనా టైము రావాలి" అంటూ భార్యని బుజ్జగిస్తుంటాడు ప్రణీత్.

రోజులు గడుస్తున్న కొద్దీ ఆమెలో ఆ ఆశ సన్నగిల్లుతోంది. డాక్టర్ని సంప్రదిస్తే బావుంటుందేమో అంది. సరేనన్నాడు ప్రణీత్. పరీక్షలు చేసిన వైద్యులు ఇరువురిలో ఏ లోపం లేదన్నారు. మరి తనెందుకు గర్భం దాల్చలేకపోతోందో తెలీడంలేదు. తన తోటివాళ్ళందరికీ ఇద్దరేసి బిడ్డలున్నారు. పార్టీలలో పిల్లల ప్రస్తావన వచ్చినపుడు తలతీసేసినట్లు ఉంటోంది. తను గొడ్రాలినేమోనన్న భావన కలిగి మరింత కృంగిపోసాగింది. దైవానుగ్రహంవల్లనైనా సంతానం కలగకపోతుందా అనుకుని భర్తను తీర్థయాత్రలకు బయలుదేరించింది. ఇప్పుడు ఆమె ఏ పనిమీద దృష్టి సారించలేక పోతోంది. ఆఫీసుకు కూడా వెళ్ళాలనిపించకపోవడంతో సెలవు పెట్టి ఇంట్లోనే ఉండి పోయింది. అయితే ఒంటరితనం ఆమెను మరింతగా బాధిస్తోంది. ఫలితంగా చిరాకు పరాకు ఎక్కువైపో యాయి.

ప్రసన్న మానసిక స్థితిని కళ్ళారా చూస్తున్న ప్రణీత్‌కి ఏం చెయ్యాలో పాలుపోవడం లేదు. పిల్లలు లేరన్నదిగులు తనకు మాత్రం లేదా? ఉన్నపళంగా ఆమె కోరిక తీర్చడానికి తన వద్ద అతీత శక్తులేవి లేవు. అందుకే పరాయి బిడ్డను పెంచుకుంటె బావుంటుందేమోనన్న ఆలోచన వచ్చింది. అంతే, ఆఘుమేఘాలమీద అనాథ శరణాలయానికెళ్ళి భోగట్టా చేసుకొచ్చాడు. భార్య అందుకు అయిష్టత వ్యక్తం చేయడంతో ఆ మార్గ కూడా పూడుకుపోయింది.

తనకెవరి సమస్యలతో సంబంధం లేదన్నట్లు కాలం దాని పని అది చేసుకు పోతోంది. ఇక ఈ జన్మకి పిల్లలు కలగరేమోనన్న బెంగతో ప్రసన్న ఆరోగ్యం రోజు రోజుకి

క్షీణిస్తోంది.

"ఇరవై నాలుగు గంటలు నువ్విలా నాలుగు గోడల మధ్య ఆలోచిస్తూ కూర్చుంటే పిచ్చెక్కినట్లు ఉంటుంది. పద.. అలా నాలుగు చోట్ల తిరిగొద్దాం. హితుల్ని, సన్నిహితుల్ని కలిసొద్దాం" అర్ధాంగి చేతులు పుచ్చుకుని బ్రతిమాలాడాడు ప్రణీత్.

మగడు మరీ అంతగా ప్రాధేయపడటంతో కాదనలేకపోయింది ప్రసన్న, లేచి చీర మార్చుకుంది.

ఇరువురూ కారెక్కారు.

అరగంట ప్రయాణమనంతరం మారుతీ జెన్ ఓ ఇంటిముందు ఆగింది.

డోర్ తెరిచి 'దిగు' అన్నాడు ప్రణీత్.

ఇదివరకు ఆ ఇంటికి తనెప్పుడు వెళ్ళలేదు. అందుకే 'ఇక్కడా?!' అంది ప్రసన్న కారు దిగుతూ.

ప్రణీత్ సమాధానం చెప్పేలోపలే ఓ ముచ్చటైన్న జంట గేటు తెరచుకుని ఎదురొచ్చింది.

"హాయ్ ప్రణీత్" కరచాలనం చేసాడు కాశీపతి.

"వీడు నా బాల్యమిత్రుడు కాశీపతిరావు. ఆమె అతడి సహధర్మచారిణి శ్రావ్య" ఇరువుర్నీ పరిచయం చేసాడు ప్రణీత్.

"నమస్తే" అంది ప్రసన్న చేతులు జోడించి.

పరిచయాలు పూర్తికాగానే ప్రసన్నని ఎంతో ఆప్యాయంగా లోనికి తీసుకెళ్ళింది శ్రావ్య.

అంతా హాల్లో కూర్చుని కాఫీ తాగుతూ కబుర్లు చెప్పుకుంటూ ఉండగా ఓ పసివాడు డేకుకుంటూ శ్రావ్య దగ్గరకొచ్చాడు.

"ఈ పిల్లాడెవరు?" అడిగింది ప్రసన్న.

"మా బాబు" బిడ్డను వొడిలో కూర్చోబెట్టుకుంటూ అంది శ్రావ్య.

ఆ పసివాడి వంక అదోలా చూసింది ప్రసన్న.

"రెండేళ్ళ ప్రాయంలో వీడికి పోలియో సోకింది. కుడికాలు చచ్చుబడిపోవడం వల్ల నడవలేడు" ఆమె ఆంతర్యాన్ని అద్దం పడుతున్నట్లుంది శ్రావ్య.

"అయ్యోపాపం" అంది ప్రసన్న.

ఆ పిల్లాడిని చూసింతర్వాత ఆమె మనసంతా అదోలా అయిపోయింది. బాబు ఎర్రగా బొద్దుగా ఎంత ముద్దుగా ఉన్నాడు? చూసిన వారెవరూ వాడిని దగ్గరకు తీసుకోకుండా ఉ ండలేరు. ఏ పాపం చేశాడని వాడికా శిక్ష? ఏ సంబంధం లేని తనకే ఇంతగా జాలేస్తుంటే, వాడిని చూస్తూ కన్నవాళ్ళెలా తట్టుకోగలుగు తున్నారో? అనిపించింది. మరి అక్కడ ఉండబుద్ధి గాక పదమని భర్తను తొందరపెట్టింది.

వస్తామంటూ లేచాడు ప్రణీత్.

కార్లో కూర్చుందన్న మాటేగాని ప్రసన్న మనసు ఆ పసివాడి చుట్టే పరిభ్రమిస్తోంది.

ఉన్నట్లుండి సడన్ బ్రేక్ పడటంతో ముందుకు తూలింది.

కారు శిథిలావస్థలో వున్న ఓ చిన్న పెంకుటింటి ముందు ఆగింది.

"ఇక్కడ మా భజగోవిందం బాబాయి ఉంటున్నాడు. లోపలకెళ్లి పలకరిద్దాం పద" అన్నాడు ప్రణీత్.

మౌనంగా అతడిని అనుసరించింది ప్రసన్న.

వచ్చిన వాళ్ళను యగాదిగా చూస్తూ "ఎవరు బాబు" అని అడిగింది ఓ వృద్ధురాలు. నిజానికి ఆవిడ వృద్ధురాలేం కాదు. మహా అయితే ఐదు పదులు నిండి ఉంటాయి. తిండి పుష్టి లేక శరీరం  వడలిపోవడం వల్ల అలా కనిపిస్తోంది.

"నేను పిన్నీ ప్రణీత్‌ని.

బాబాయిగారున్నారా?" అడిగాడు.

"నువ్వాబాబు ఎవరో అనుకున్నాను. ఈ మధ్య నాకు దృష్టి ఆనడంలేదు ఏమనుకోకు. మీ బాబాయి గారు ఆ గదిలో పడుకున్నారు. వెళ్ళి మాట్లాడు" అంది ఎంతో ఆప్యాయంగా.

వాళ్ళ మాటలు చెవిలో పడ్డట్టుంది. "ప్రణీతా!" అంటూ దిగ్గున లేచి కూర్చున్నాడు భజగోవిందం.

"బావున్నావా బాబాయ్. చూడు ఎవరొచ్చారో!.. నా భార్య ప్రసన్న" అంటూ అర్ధాంగిని పరిచయం చేసాడు ప్రణీత్.

"అలాగా! చాలా సంతోషం బాబు. వంట్లో బాగోలేకపోవడంవల్ల నీ పెళ్ళికి రాలేకపోయాను" నొచ్చుకుంటున్నట్లుగా అన్నాడు భజగోవిందం.

"అది సరే, నువ్వేంటి ఇంతలా చిక్కిపోయావ్? జబ్బేంలేదు కదా!" అన్నాడు ప్రణీత్.

"జబ్బు అతనికి కాదు, మావాడికి" అంది కావేరి వాళ్ళ సంభాషణలో పాల్గొంటూ

ఆవిడ మాటలు అర్థంగాక ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు ప్రణీత్ దంపతులు.

"మా తిండికి, మందులకి తన సంపాదన ఎక్కడ ఖర్చుచేయవలసి వస్తుందో నని ఒక్కగాని ఒక్క కొడుకు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని దూరంగా వెళ్లిపోయాడు. అప్పటినుంచి మేం ఉన్నామో లేదోనన్న సంగతే పట్టించుకోవడం మానేసాడు. ఉన్నదంతా వాడి చదువుకి ఊడ్చిపెట్టాం. ఇప్పుడు చేతిలో చిల్లి గవ్వలేక నానా అవస్థలు పడుతున్నాం. నా మతిమండా మిమ్మల్ని నించోపెట్టే మాట్లాడేస్తున్నాను. కూర్చోండి" అన్నది కావేరి చాప పరిచి.

ఆవిడ మాటలకు ప్రసన్న మనసు మంచులా ద్రవించుకుపోయింది. కడుపు చించుకుని పుట్టిన బిడ్డలు అంత కఠినంగా ఎలా ఉండగలుగుతున్నారో అనుకుంది. వెంటనే హ్యాండ్‌బ్యాగు తెరిచి రెండువెయ్యి రూపాయల నోట్లు తీసి ఆవిడ చేతిలో పెట్టబోయింది.

"వద్దమ్మా. ఇంటికొచ్చిన వాళ్ళని ఆదరించకపోగా వాళ్ళనుంచి డబ్బుపుచ్చుకోవడ మేంటి?" అన్నది కావేరి.

"మా ఆయన కూడా మీ బిడ్డలాంటివాడే కాదనకండి" అంటూ బలవంతంగా ఆవిడ చేతిలో డబ్బుపెట్టింది.

ఆ మాట ఈ మాట అయ్యాక వస్తామంటూ లేచారు ప్రణీత్ దంపతులు వాళ్ళను గుమ్మం వరకు సాగనంపింది కావేరి.

ప్రసన్న మదిలో సంఘర్షణ మొదలైంది. కన్నవాళ్ళని వాళ్ళ కర్మకు వదిలేసి బిడ్డలు అంత కఠినంగా ఎలా ఉండగలుగుతున్నారు? వాళ్ళకు ఏకోసానా జాలి, ప్రేమ అనేవి ఉండవా? అటువంటప్పుడు పేగు బంధానికి అర్థమేముంది?... మళ్ళీ అంతలోనే తన పిచ్చిగాని ఎందుకుండవు? లోకంలో బిడ్డలంతా భజగోవిందం కొడుకులాగే ఉంటున్నారా? అమ్మానాన్నల్ని ఎంతో అపురూపంగా చూసుకునే పిల్లలు కూడా ఉన్నారు. బిడ్డల ప్రవర్తన కన్న వాళ్ళ అదృష్టం మీద ఆధారపడి ఉంటుందేమో అనిపించింది.

"ఇక ఇంటికి పోదాం కారు వెనక్కి పోనివ్వండి" అసహనంగా అంది.

భార్య మూడు మారిపోయిందని గ్రహించి "అలాగే ఈ దగ్గర్లో మా కొలీగ్ కార్తీక్ ఉన్నాడు. ఎప్పటి నుంచో వాడింటికి రమ్మని పోరుతున్నాడు. ఎలానూ ఇంత దూరం వచ్చాం. వాడినోమారు చూచి వెళ్లిపోదాం" అన్నాడు ప్రణీత్.

మాట్లాడలేదు ప్రసన్న.

కారు దిగి లోపలకొస్తున్న ప్రణీత్ దంపతుల్ని సాదరంగా లోనికాహ్వానంచాడు కార్తీక్. ప్రక్కనే వున్న తనభార్య భారతీదేవిని వాళ్ళకు పరిచయం చేసాడు.

"రండి కూర్చోండి" అంది భారతీదేవి.

భోంచేయకుండా వెళ్ళడానికి వీల్లేదంటూ కార్తీక్ ఒత్తిడి చేయడంతో ఆ రాత్రి అక్కడే గడిపి మరునాడు పొద్దున్నే తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యారు.

వెళ్ళేముందు "మీ పెళ్లై ఎన్నాళ్ళైంది?" అడిగింది ప్రసన్న.

"ఈ శ్రావణ మాసానికి సరిగ్గా ఆరేళ్ళవుతుంది. పిల్లలు లేరనా అలా అడుగు తున్నారు" అంది భారతీదేవి.

"ఉహుం అందుకు కాదు. కొందరికి సంతానం ఆలస్యం కావచ్చు. అందుకు మేమే ఉదాహరణ. పెళ్ళై నాలుగేళ్ళయినా మాకు పిల్లలు కలగలేదు. మా దిగులు అదొక్కటే" అంది ప్రసన్న ఆమె మనసును గాయపరచి నందుకు బాధపడుతూ.

"పిల్లలు లేరన్న దిగులు మీది. కడుపు కోత మాది. మా కంటె మీరే నయం" అన్నది భారతీదేవి.

ఆమె మాటలు అర్థం కాలేదు ప్రసన్నకి.

"మాకు ఇద్దరు పిల్లలు పుట్టిపోయారు" కళ్ళు వత్తుకుంటూ అంది భారతీదేవి.

ఆ మాటకు అదిరిపడింది ప్రసన్న.

"పిల్లల అంగవైకల్యాన్ని చూడలేక బాధపడేవాళ్ళు కొందరైతే కన్నబిడ్డల నిరాదరణకు గురైన అభాగ్యులు మరికొందరు. పుట్టిన పిల్లలు పుట్టినట్లే పోవడంతో గర్భశోకానికి బలైన వాళ్ళు ఇంకొందరు. ఇలా లోకంలో పిల్లలగలవాళ్ళెవరూ సుఖంగా
ఉన్నట్లు నాకనిపించడంలేదు" అంది ప్రసన్న ఇంటికొస్తూనే.

ఇప్పుడు ఆమెకు గుండెల మీంచి పెద్దభారం దిగిపోయినట్లనిపించింది. అంతే, మరునాడు లేస్తూనే హుషారుగా ఆఫీసుకు తయారైంది.

ఆమెలో ఈ మార్పు కోసమే ఇన్నాళ్లూ ఎదురుచూసాడు ప్రణీత్. కట్టుకున్న దాని మనోవేదన చూడలేక ఓ సైకియాట్రిస్టు సలహామేరకు తను ఎంపిక చేసిన ఇళ్ళకు తీసుకెళ్ళాడని ప్రసన్నకితెలీదు.

(8 ఆగస్టు 2009 ఆంధ్రభూమి దినపత్రిక)

